# వి జ య ద శ మి

అమ్మయ్య !

ట్రాం బం డి కదిలింది....

ఇనప జంతువు మైలపూర్ లజ్‌లో మనుష్యుల్ని భోంచేసి భుక్తాయాసంతో బయలుదేరింది.

టంగ్.... టంగ్.... డ్రామ్.... డ్రీం.... తన డ్రీంలోంచి కొంచెం కదిలి ఆనందరావు ఆలోచిస్తున్నాడు. ఈ విశ్వనాథం ఉత్తరం ఏమిటి చిత్రంగావచ్చింది! మళ్ళా ఎన్నాళ్ళకు ? మార పులు ముదిరి ఆ పచ్చతనాన్ని ఎంత తుడిచినా....ఆ పల్లెటూరు ....చిక్కని గంగరావిచెట్లు.... ధ్యానానికి ముందుగా కనపడే శివాలయ శిఖరం....కోనేరు ఎర్ర కలవపువ్వులు....ఇసకవీధులకు రెండువైపులా పూచిన తురాయిపూల గుత్తులూ....

డ్రూ....డ్రాన్ మళ్ళా ఆగింది. బండెడు మద్రాసునాగరికత బండిలో ఎక్కింది. ఆంగ్లోఇండియన్ పూతమెఱుంగులు, సినీ ఎక్స్‌ట్రా చిలకలు,....ద్రావిడ మందారాలు....బుష్‌కోట్లు....పొట్టిమీసాలు.... శుద్ధశివరాలు.... ఎక్కడికో ఈ ప్రయాణం! అదే ఈ నాగరికతలోని విశేషం. కొన్నాళ్ళు విడవకుండా మదరాసులోఉంటే ఒక ఇనపచక్రమైపోతాడు కాబోలు మానవుడు! చోటులేక ఒక అమ్మాయి ఎదురుగానుంచుంది. హృదయంలో ఎట్లాఉంటే ఏం? ఈ లాంఛనాలు తప్పవు. చిరునవ్వులు-

నమస్కారాలు, సెలవు పుచ్చుకోడాలు, అన్నింటి వెనకా ఎన్ని ఇనపచక్రాలు! చక్రంలా అప్రయత్నంగా లేచి ఆనందరావు ఆ అమ్మాయికి చోటిచ్చి పైనున్న ఇనపరింగులోకి వేళ్ళుదూర్చి ట్రామ్‌మధ్య ఊగుతూ నిల్చున్నాడు. ఆ అమ్మాయి జడలోని కదంబం చూస్తూ, "వట్టి నిర్గంధకుసుమాలు" అనుకున్నాడు. "రంగుల ఇంద్రజాలమగురా, నగరాయతివాస వాసనారంగము" తరువాత ముక్క జ్ఞాపకం రావడంలేదు. ఈ పట్నవాసపు చెట్లు కూడా పేదివాడి గడ్డంలా మొహమాటంగా సిగ్గుగా పెరుగుతాయి గాబోలు....మౌంటురోడ్డు, జార్జిటవునులో, చెట్లు గడ్డితో చేసి ఏదో రంగు పులిమినట్లుంటాయి. ఆకుల్లో పచ్చతనం లేదు. పువ్వుల్లో నిజాయితీ పోయింది. అంతా కృతకం. ఏమి బ్రతుకులివి? విశ్వనాధానికి నామీద ఎంత అపేక్ష! బాల్య స్నేహం....ఆదరం చిందేలా వ్రాశాడు.

జరగండి....జరగండి....ఉక్కారుంగో....కదంబం ప్రక్కకాళీఅయింది. ఒక బుష్‌కోటు చట్టున సర్దుకుంది. పొట్టిమీసానికి కోపం వచ్చింది. అబ్బా! కాలు తొక్కావయ్యా; కళ్ళుకనపడవా? "కనపడకే అట్లా మాట్లాడ్డం". మగదూది గుట్టలకి, స్త్రీ నిప్పు రవ్వ గాబోలు! ఇట్టే అంటుకుపోతాయి. కాలు తొక్కలేదు. కళ్ళు చక్రాల్లా ఉన్నాయి. అక్కడ ఉన్న కారణం అల్లాటకటే. అది ఒక పూలజడ! రామాయణ భారతాల వెనకఉన్న కీలకం ఇంకేమిటి? ఇది చెప్పలేని వేదన. మూగబాధ. పైకి మర్యాదా పోగూడదు. లోపల జంతువుల గాండ్రింపులు. ఇదేనా మానవ జాతిని నడిపే మహాయంత్రం?

గర గర....గణ గణ బండినడుస్తోంది. కాఫీహోటల్

రేడియోల్లోంచి అక్కర్లేని అభాగ్యులకు అమృతం పంచిపెడుతున్నారు, సుబ్బలక్ష్మి - లతామంగేష్కర్.

అతిపరిచితాలయిన మదరాసు వీధులు ఒక్కటొక్కటే తప్పుకుంటున్నాయి. లాయిడ్స్‌రోడ్డు, రాయపేట, మౌంటురోడ్డు, సెంట్రల్, అబ్బా! చెఱవదలింది. ఆనందరావు చట్టునదిగి సామాను సర్దుకున్నాడు. పూలబుట్ట, లెదరు సూటుకేస్, కాగితపుపాకెట్, హోల్డ్‌ఆల్. ట్రాంపట్టాలు దాటి స్టేషనులోకి వెళ్ళేసరికి కలకత్తా మెయిలుకు మొదటిగంట కొట్టారు. టికెట్టుకొని ఇంటరు తరగతిలో చోటుచేసుకొని కోటు విప్పి కిటికీలోంచి చూస్తూ తన శరీరం అప్రయత్నంగా తడుముకొని, తను ఫలానా అని జ్ఞాపకం తెచ్చుకొని, స్తిమితపడ్డాడు. సమ్మెట్లు, సుత్తులు, కార్లూ, కొలిములు అవిరామంగా పనిచేసే ఫాక్టరీ హోరులోనుంచి హఠాత్తుగా ఒక చెట్టుక్రిందికి వచ్చి కూర్చున్నట్టనిపించిందతని ప్రాణానికి. మెయిలు బయలుదేరింది.

## ౨

ఆ అంధకారాన్ని చీల్చుకొంటూ మెయిలు సూళ్ళూరుపేట దాటింది. నిద్ర రావడంలేదు. విశ్వనాథం జ్ఞాపకం వచ్చాడు. ఫిల్మురీల్ తిరిగింది. సుమారు 20 ఏళ్ళ క్రితం. విజయనగరం కాలేజీలో ఇంటర్ క్లాసుమేట్సు....ఆ యిద్దరూ. హాస్టలులోకూడా ఒకే గదిలో ఉన్నారు. విశ్వనాథం ఏదో పల్లెటూరునుంచి వచ్చాడు. చెవలకి మెఱుగు బిళ్ళలు, కనీకనపడని క్రాపు, లావుగా పొట్టిగా పోకెట్‌డిక్షనరీలా ఉండేవాడు. ఇంగ్లీషుట్విల్ కమీజులు, గ్లాస్కోమల్లు పంచెలు ఇష్టం. డబ్బున్నా చాలా లెక్కలమనిషి.

రాత్రి ఎకౌంటురాయందే పడుకొనేవాడుకాడు. తన వస్తువులన్నీ అద్దం, దువ్వెన్న, తలనూనెసీసా, తువాళ్ళూ, పుస్తకాలూ, అతి నీటుగా ఉంచేవాడు. ఆనందానికి అప్పటికే అసహాయోద్యమం గాలి సోకింది. ముదర ఖద్దరుచొక్కా, పంచ, సోగగా, పచ్చగా ఉండేవాడు. బాగా సంస్కారం ఉన్న సంఘంలోంచి వచ్చాడు. అతనికి తెలియని సంగతిలేదు. కవిత్వంమీద, నాటకాలమీద, అప్పటి రాజకీయాలమీద, గళగ్రాహిగా ఉపన్యాసాలిచ్చేవాడు. అతిబద్ధకస్తుడు. పుస్తకాలు ఒకచోట, తలగడా ఒకచోట, వస్తువులన్నీ ఎక్కడెక్కడో ఉండేవి. సబ్బులేకపోయినా స్నానానికిగాని, దువ్వెన్నలేకపోయినా తలదువ్వుకోడానికిగాని, అతనికి అభ్యంతరం ఉండేదికాదు అతనికి నాదీ అన్నది ఏదీ లేదేమో అనిపించేది. విశ్వనాథంవస్తువులన్నీ స్వేచ్ఛగా ఉపయోగించేవాడు. ఈ అద్వైతసిద్ధి చూసి విశ్వనాథానికి లోపలలోపల మంటగా ఉండేది. అతవి మిలిటరీడిసిప్లిన్ చూసి ఆనందం నవ్వేవాడు.

ఆనాడు దేశనాయకుల్నిద్దరిని అరెస్టు చేశారని పత్రికల్లో పడ్డది. పట్టణమంతా అట్టుడికిపోయినట్టు తల్లడిల్లిపోయింది. ఊరంతా హర్తాల్ చేశారు. విద్యార్థులానాటికి కాలేజీకి వెళ్ళకూడదని తీర్మానించి అసమ్మతిసూచకంగా ఊరేగింపు బయలుదేరదీశారు. జయజయ నినాదాలతో నడుస్తూ పోలీసుస్టేషను దగ్గఱకి వచ్చింది ఊరేగింపు. మొనలో ఆనందం, గాంధీటోపీతో జండాతో నిల్చుని ఉన్నాడు. పోలీసుఅధికారి వచ్చి 'డిస్పర్స్' అన్నాడు. విద్యార్థులు కదలలేదు. లాఠీలు పనిచేశాయి. పాపం చాలామందికి బలమైన గాయాలు తగిలాయి. హాస్పిటలుకు చేర్చారు. విశ్వనాథం వెతుక్కుంటూ వచ్చి, ఆవందం మంచందగ్గిర నిల్చున్నాడు.

ఆనందం తలమీద గట్టిదెబ్బతగిలింది. కట్టిన కట్టులోంచికూడా నెత్తురు చిమ్ముతోంది. విశ్వనాథం జాలిగా చెయ్యిజాచి బాధగా ఉందా? అని తలమీద కట్టుతాకబోయాడు ఆనందం కళ్లువిప్పి బలహీనంగానవ్వుతూ "విశ్వం! నీబట్టలు మాసిపోతాయి జాగ్రత్త" అని దూరంగాజరిగాడు. విశ్వనాధం కళ్లుచెమ్మగిలి మాట్లాడకుండా వెళ్లిపోయాడు ఆనందం నెమ్మదిగా తేరుకొని హాస్టలుకువెళ్లిన నాడు ఎట్టుని ముదుకఖద్దరు బట్టలతోవచ్చి విశ్వనాథం కౌగలించు కొని నిన్ను పోలీసులుకొట్టిన దెబ్బకన్న నన్ను ఎక్కువదెబ్బ కొట్టావుగదూ. అన్నాడు పకపకానవ్వుతూ.

'ఇప్పుడు గాయాలన్నీ మానిపోయాయిగా' అని గాఢంగా మిత్రుణ్ణి పొదువుకున్నాడు ఆనందం. ఆరోజు మొదలుకొని ఒకటేపాణం. హాస్టలు దే వస్తే, కాలేజీ వార్షికోత్సవంలో, ఒకరివెంట ఒకరువిల్చి, ఆ ఉత్సవం జేగీయమానంగా జరిపి వదలిపెట్టేవారు. ఏబాధ్యతా తీవ్రాలోచనాలేని ఎంతనిర్మల జీవితం అది! ఆ ఆటలు, షికార్లు, స్నేహితులు, ఆదర్శాలు, ప్రతిఉద్య మానికీ ప్రతిధ్వనించే లేతమనస్సులు !!

*　　*　　*　　*

రైలు గిఢగురుఘని కూసింది. ఏదో స్టేషనులో ఆగింది గాబోలు, లేచి చూసేఓపికలేదు. కళ్లుమూతలు పడుతున్నాయి. విశ్వంఇప్పుడెలాఉన్నాడో! భూముల్లో సంసారంలోస్థిరపడి సుఖం గా కాలక్షేపంచేస్తున్నాడు గాబోలు. పెళ్లికి రమ్మని రాస్తే...వెళ్ల లేకపోయాను. ఆఇల్లాలు ఇతని క్రమశిక్షణలకి నవ్వుతూ గడుపు కుంటోంది గావును! ఎన్నాళ్లయిందో అతన్నిచూసి. నన్ను చూసి

గుర్తు పట్టనేలేదేమో. అతడు మరింతలా వెక్కి, నేను మరింత సన్నమై ఎదురు పడితే ఎంత చిత్రంగా ఉంటుంది! నిరుద్యోగ సమస్యలో నలిగి విధి విసరి నట్లల్లా ఎగిరి, తుదకు మదరాసు దినపత్రికలో సహాయసంపాదకుడుగా చేరి, వచ్చిన ఇంగ్లీషు వార్తా ఖండాలికి అనువాదాలు చేస్తూ, అచ్చుయంత్రంలో ఒక చక్రంలా తిరిగేనాకు ఈవిశ్వనాథం దసరా పిలుపు ఎంత సరదాగా ఉంది! ఈజీవితంలో ఎన్నిదసరాలు గడచినవో! విజయనగరంలో విశ్వనాథం నేను రాత్రి వెన్నెలలో తెల్లవార్లు ఒక విజయదశమి గడిపాం. నాటికినేడు మళ్లా.... స్నేహానికి ఇంతతియ్యదనమే లేకపోతే ఈబ్రతుకులు ఇంకా బరువెక్కిపోయేవేమో. రేపు విశ్వాన్నిఅడగాలి.,,నిద్ర కళ్లల్లో ఊగింది.

## 3

జట్కాబండి ఆగింది. బండిదిగాడు ఆనందరావు. బండి వాడు సామాను అరుగుమీదపెట్టి బాడుగతీసుకొని వెళ్లిపోయాడు.

తలుపులు మూసిఉన్నాయి. పాతపద్ధతిలోకట్టిన చక్కని డాబా. విశ్వానికి ఉత్తరంవ్రాయవలసింది. బండిదిగేసరికి స్వాగతమిచ్చేవాడు. కాని 'సర్‌ప్రైజ్' చేద్దామని వ్రాయలేదు. ఇంట్లో ఉన్నాడేమో? రెండుసార్లు తలుపుకొట్టి పిల్చాడు. లోపలఅలికిడేమీ వినపడ్డంలేదు. పిల్లల్లేరా? ఏఉత్తరంలోనూ ఈప్రసక్తిరాలేదు. ఉంటే ఈపండగరోజుల్లో ఇల్లు ఇంతశాంతంగా ఉంటుందా!' తలుపు నెమ్మదిగావిడింది. సామానుతీసుకొని లోపలికివెళ్లాడు. లోపలిగడప దాటుతూ ఒకమొగలిపూలజడ, ఆకుపచ్చచీరా,

కాళ్లకి సన్నని వెండిపట్టాలు కనపడ్డాయి. తలుపుచాటునుంచి 'ఇంట్లోలేరు. వస్తారు సావిట్లోకూర్చోండి' అనేమాటలు అశరీర వాణిలా వినపడ్డాయి. ఆనందానికి కొత్తప్రపంచం పొలిమేరలోకి వచ్చినట్లనిపించింది. 'ఎంతవ్యత్యాసం! పట్నంలో స్త్రీలు మగ వారితో సమంగా రాచుకుతిరుగుతారు, ఈఅణకువఉండదు. కంఠంలో ఎంతలాలిత్యం! ఎంతనెమ్మది! ఋషివాటికలో ముని పత్నులు జ్ఞాపకంవచ్చారు. ఇంతసుకుమారమైన ఆర్య స్త్రీ ప్రకృతిని పట్నాలు ఎంతమోటుగా అసహజంగా తయారు చేశాయి! ఇదినాగరికత అంటారు. ఏం నాగరికత? కృత్రిమమైన వైదేశికనాగరికత! మనకు నాగరికతేలేదా? ఉంటే పూడ్చి పెట్టాం." హాల్లో ఒకకుర్చీలాక్కొని కూర్చున్నాడు. నాలుగయిదు కొత్తరకం కుర్చీలు. మధ్యని గుండ్రని "టిపాయ్" మీద రంగు దారాల పూలుకుట్టిన తెల్లనిగుడ్డ. వెల్లగోడలమీద రెండు మూడు మంచి బొమ్మలకేలండర్లు. సమయానికి విశ్వంలేకపోయినందుకు కొంచెం నిరుత్సాహంగాఉంది. ప్రయాణంబడలికచేత కళ్లుమూతలు పడుతున్నాయి. పావుగంటలో విశ్వనాధం వచ్చాడు. కొంచెం పొడుగు ఎదగడంవల్ల అట్టే లావు కనబడ్డంలేదు. సిల్కులాల్చీ. సన్నపంచె, ఆరోగ్యంగా నున్నగాఉన్నాడు. కొంచెం లోపలికి ఒంగిన కనుబొమ్మలు, దగ్గఱగాకలుసుకొనే పెదవులు. చూస్తే పట్టుదలా, చిన్నవ్యత్యాసం భరించలేని ప్రకృతీ, అవితెలుస్తుంది.

'ఇదిగో....ఎవరూ? ఆనందమేనా! ఎన్నాళ్ళకి' చిఱునవ్వు తో దగ్గఱగావచ్చాడు. ఆనందం చట్టునలేచి కౌగలించుకొన్నాడు. ఆనందం కంటిలో ఒకటిరెండు ముత్యాలు జారిపడ్డాయి.

విశ్వంఅన్నాడు‘దుర్మార్గుడా! అసలు రావేమోఅనుకొన్నాను,రెండు రోజులనుంచి రైళ్లుఒకటేచూడ్డం. మద్రాసువెళ్లాక మరీ డబ్బు పొదుపునేర్చుకున్నావులే. మూడుకాన్లకు గతిలేకపోయిందా. ఒక కార్డువ్రాస్తే స్టేషనుకువచ్చి వాలకపోయానా?’ “షటప్. మేం పట్నంలో ఉద్యోగస్థులం. పొలందున్నుకుబతికేవాడికి నీకు ఉద్యోగ ధర్మాలేంతెలుసు? నీవు సెలవివ్వడమేగాని పుచ్చుకోడం ఎఱుగవు. ‘బాస్’దగ్గఱ నాలికజాపి తోకఆడిస్తూ సాగిలపడితేనే గాని నాల్గురోజులు సెలవుదొరకదు. సంపాదించి వెంటనే మెయిలు ఎక్కాను’. విశ్వం పకపకానవ్వుతూ ఒకపడకకుర్చీలోకి ఆనం దాన్నితోసి, తానొకకుర్చీని దగ్గఱగాలాక్కొని, ‘ప్రయాణంలో బాగానలిగిపోయావుకదూ! కాఫీయేనాపుచ్చుకొన్నావా! ఇక్కడ. మాఆవిడ పట్టిపల్లెటూరిగోల, తలుపుదాటి బయటకురాదు. ఏం జరిగిందో! సమయానికి నేనూలేకపోయాను. పోనీ తుదకు వచ్చి మంచినీళ్లైనా”. నవ్వుతోకలిపేశాడు. ‘కావలిస్తే నేనేఅడుగుదును. నీసెలవేమిటి? దాహంవేయటంలేదు’ అన్నాడు ఆనందం. “సరే; అనుకున్నంతా అయింది. ఉండు” అని విశ్వం చరచరాలోపలికి వెళ్లి నిమిషంలో రెండువెండికప్పులతో కాఫీతెచ్చి ఆనందం ఎదుటఉంచి ‘చిత్తగించండి’ అన్నాడు. మద్రాసు విశేషాలతో, అంతర్జాతీయ రాజకీయాలతో, చిన్ననాటి ముచ్చట్లతో, ఇద్దరూ కాఫీసేవించి మిగిలిన కబుర్లు అందుకున్నారు. పట్టణజీవితం, పిల్లలు, చాలీచాలని రేషనుభోజనం, రాష్ట్రసమస్యలు, విశ్వ నాథం ప్రశ్నించి తెలుసుకున్నాడు. నౌకరు స్నానానికి వేన్నీళ్లు సిద్ధంగాఉన్నాయని చెప్పివెళ్లాడు. ఆనందం స్నానంచేసి శుభ్ర

మయిన బట్టలువేసుకొని విశ్వనాథంవెంట భోజనానికి వెళ్లాడు. విశ్వం పీటమీద సర్దుకుంటూ 'జానకీ, వడ్డించు' అన్నాడు. ఆమె వచ్చి రెండరటాకులుపరచి శుభ్రంగాతుడిచి వడ్డనచేసింది. పెళ్లైయిన తరువాత ఆనందం, విశ్వంభార్యనిచూడలేదు. ఆరవేసిన ఉప్పాడ జరీతెల్లచీర కట్టుకొని, ఆకుపచ్చని సిల్కురవిక తొడుక్కుంది. ముడిగాచుట్టిన జుట్టులో ఒకేఒక్క చెట్టుసంపంగిపువ్వు. కళ్లలో సన్నని కాటుకరేఖలు. నుదుట ఎర్రని చిన్నకుంకుమ బొట్టు. యౌవన శోభతోనిండిన బంగారుఛాయ. అంతవరకు పూజలుపుచ్చుకున్న కాత్యాయినీదేవి పీఠంనుంచి దిగివచ్చిందా, అనుకున్నాడు ఆనందం. అతన్ని ఏదోజ్ఞాపకం పొడిచింది. ఒక్క నిమిషం కళ్ళు మూసుకొన్నాడు. పూజాపీఠంనుంచి మంచిరకం అగరువత్తులవాసన, బుద్ధిని ఏదో పవిత్రవాతావరణంలోకి తీసుకు వెడుతోంది. "జానకీ! ఈ ముద్దకూరలేమిటి నీమొహం? ఈ పచ్చడేమిటి; నాలుగరటికాయలు వేయించి కాస్త పెరుగుపచ్చడి చెయ్యలేకపోయావు? వట్టి నాటురకమోయ్ మా ఆవిడ——నేమ్యా పాయసం చేయమంటే, గారెలు, ఆవడలూ చేసిందండీ." పకపక ఎగతాళిగానవ్వి ఒకఆవడ విరిచాడు విశ్వం. "ఏమ్ విశ్వం,.... ఇవి నీకోసంకాదు —— ఆవిడ చేస్తే; నాకోసం. వేపుడుకూరలతో విదేశపాయసాలతో విసిగిపోయిన ఈదీనుడికి శారదాదేవి ప్రత్యక్షమై ఈ కమ్మనిపదార్థాలు అనుగ్రహించింది, మా వంటకాలునీకునచ్చకపోతేనువ్వీరెండురోజులు ప్రాయోపవేశం చెయ్యి. అన్నాడు ఖులాసాగా! విశ్వం కొంటెగా 'అవునా'! అన్నాడు. కనుగొలకులలోంచి భార్యనుచూస్తూ. ఆమె వింతగా

ఆనందరావువైపు చూసి ఊరుకుంది. విశ్వం అన్నాడు "ఇదిగో ఈయన నాకు ప్రాణంలాంటి స్నేహితుడు, కాలేజిలో చదువు కొన్నాం. పట్నంవెడితే ఆయనభార్యా పిల్లలు ప్రాణంపెడతారు. నువ్వు పల్లెటూరిఅణకువలు ముణుచుకోవడాలు మాని ఈరెండు రోజులూ ఖులాసాగా ఉండాలి లేకపోతే ఈయన "పట్టి తలుపు చాటు పల్లెటూరిపిల్లను పెళ్ళాడాడు విశ్వం" అని పట్నం అంతా యాగీ చెయ్యడమేకాకుండా తన పత్రికలోకూడా వేశేస్తాడు. తరువాతనీయిష్టం". అన్నాడు ముఖం అతికొంటెగాపెట్టి.ఆనందం పకపకానవ్వి అతన్ని పీటమీదనుంచిలేవదీశాడు. భోజనాలయాయి. జానకి, ఆ మిత్రులిద్దరి చనువుచూసి తలవంచి నవ్వుకుంది. ఇద్దరు సావిట్లోకివెళ్ళి ఘుమ ఘుమలాడే వక్కపొడితో తాంబూల చర్వణం ప్రారంభించారు.

తాంబూలం అయాక ఆనందం పట్నంనుంచితెచ్చిన పూల బుట్ట విశ్వనాధానికి అందిస్తూ "కుమారా! ఈ పుష్ప కరండమును అంతఃపురమున కందజేయుము, నీకు మేలయ్యెడుగాక" అన్నాడు నవ్వుతూ, "చిత్తముమహేంద్రా" అని పూలబుట్ట పట్టుకొని విశ్వం లోపలకి వెళ్ళాడు. 3 గంటలయింది. మిత్రులిద్దరు మధ్యాహ్నం నిద్రలయి లేచారు సావిట్లో కూర్చొని లోకాభిరామాయణంలో పడ్డారు. ఇల్లాలు ఫలాహారం, కాఫీ పట్టుకు వచ్చింది. విశ్వనాధం చట్టున ప్రసంగంఆపి 'అదిగోనండి జగన్మోహిని, అమృతం తెచ్చింది. దేవదానవులంతా సర్దుకోండోయి' అని 'టీపాయి' దగ్గరగా లాగాడు. ఆనందం తలెత్తి చూశాడు, ఖద్దరు సిల్కుచీర, పెద్దపట్టంచు జాకెట్, గుండ్రంగాచుట్టిన జడలో, పట్నంచామంతి

పూలు, దవనం, తురుముకున్న గృహలక్ష్మి! ముఖంలో తరతరాల ఆర్యసీమంతిమలు దాచుకొన్న లజ్జా మధుర సౌందర్యం పరిమళించింది.

వెండిపళ్లెంలో వేడిజిలేబీలు, కారపుబూంది, రెండుపింగాణీ కప్పులలో పొగలుచిమ్మేకాఫీతెచ్చి ఆమెటిపాయ్‌మీదపెట్టిప్రక్కగా నుంచుంది. "ఏమమ్మా జిలాబీ నాకిష్టమని నీకెవరుచెప్పారు? ఆప్తబంధువులకు అట్లా తెలుస్తాయిగాబోలు. ఈ అమృతంలో దానవులకు వాటాలేదు." అని ఆనందం వెండిపళ్ళెం ఆక్రమించుకొన్నాడు. విశ్వం పళ్ళెంలో చెయ్యిపెట్టి 'దానవులు దేవతల ఇష్టానిష్టాలతో నిమిత్తంలేకుండా స్వీకరిస్తారు.' అంటూ ఒక జిలేబీ స్వాధీనంచేసుకొని ఇంత కారపుబూంది నోట్లోవేసుకొన్నాడు. కలకలనవ్వులతో హాలంతా మల్లెపువ్వులు చిమ్మినట్టయింది. జానకి తలవంచుకొని సన్నంగా "దానవులుకారు, ఆయన మహేశ్వరులు" అనినవ్వి మంచినీళ్ళు తేవడానికి చరచరా లోపలికి వెళ్ళింది. ఆమెమాటలలోని చాతుర్యానికి ఆనందంమురిసి విశ్వాన్ని కొంటె నవ్వుతో చూశాడు, అడ్డుతెరలు తొలగిస్తే స్త్రీ చాతుర్యం కాంతులు ఓమ్ముతుంది కాబోలు! వంశపూర్వపురుషుల విజ్ఞాన తపస్సు అప్రయత్నంగా ఏనెత్తురు కణంలోనో అంటిపెట్టుకొని ఒక్కొక్కప్పుడు చట్టున వెలుగుతుంది!

విశ్వనాధానికి తనభార్య కొత్తగా ఏక్షీరసముద్రతీరంనుంచో నడచివచ్చినట్టనిపించింది. ఆమె ఇంతమధురమూర్తి అని ఇదివర కెప్పుడూ తోచలేదేమో. ఇంకోపురుషుడు దగ్గరున్నప్పుడు గాని భార్య అందం కనపడదుకాబోలు. వెనువెంటనేవెళ్ళి తనఅమృత

మూ_ర్తిని దగ్గఱగా..........చూడాలనిపించి లోలోన నవ్వుకొని ఊరుకున్నాడు. ఫలహారానంతరం ఆనందం బట్టలుమార్చు కోవాలని వెళ్ళాడు. విశ్వం గ్రామఫోనుకు 'కీ' ఇచ్చి చచ్చి స్వర్గానఉన్న సైగాల్ మహాశయుణ్ణి దేవదాసుగా పాడిస్తున్నాడు. ఆపాట జాలి జాలిగా ఏవో మరపుల్లో. మరుగుపడిన విషాద ప్రేమగాథలను రేపి ఒక్కొక్క పూలవాసన మనస్సును కలచి నట్లు బాధపెడుతోంది. ఆనందం బట్టలువేసుకువచ్చి 'ముషాయ్' ఆ హిందీపాట వద్దు- మనస్సు కోతపెడుతుంది. చక్కని పెళ్ళి పందిర, పన్నీరు, జ్ఞాపకంవచ్చేలా త్యాగరాజును పాడించవోయ్' అన్నాడు బతిమాలుతూ."సైగల్ ...భాయ్.... ఈ పంకజమల్లిక్ను విను." పిన్నుమార్చుతూ ఇంకోరికార్డు అనుసంధిస్తుండగా జానకి వచ్చి నవ్వుతూ శుభప్రదంగా కర్నాటక సంగీతం వినిపిద్దుర్యూ పుణ్యంఉంటుందీ అని 'నగుమోము గనలేని'—— అందించింది. విశ్వనాథం విసుక్కుంటూ నువ్వు వేసుకో ఆయనకూడా సంతోషి స్తారు. నేను బట్టలు మార్చుకుంటానని వెళ్ళిపోయాడు. జానకి నవ్వుతూ ఫోనుదగ్గరకు వెళ్ళి 'పక్కల నిలబడి' అన్న రికార్డు వేసింది. ఆ సంగీతమాధుర్యానికి ఆమె పరిశుద్ధమైన అభిరుచికి ఆనందంచకితుడై వింటున్నాడు, ఆమెపాటలోనిమగ్నఅయి పాట తీయని మత్తులో పిన్నురాచుకొంటున్నా. తీయడంమరచిపోయింది. విశ్వంచట్టునవచ్చి ఆపి ఇంక సంగీతంచాలు నీపనిచూసుకో అన్నాడు. జానకి చట్టునలేచిఅవును పనిఉంది అని వెళ్ళిపోయింది. ఆనందం ప్రకృతిలోపడి త్యాగరాజుకు మనంపడ్డఋణం ఈ జన్మలోతీర్చుకోలేమయ్యాఅన్నాడునిద్రలోంచిమేల్కొంటూన్నట్టు."

అడ్డమైనవాడూ అసహ్యంగాపాడి ఆయన ఒకరాక్షసుడు అనిబూజావు చేస్తున్నాడు చాలదూ, ఆ కృతజ్ఞతా”.... అన్నాడు అతనివీపుపై తట్టుతూ విశ్వనాధం. ఇద్దరూ పొలాలవైపు షికారువెళ్ళారు.

♦ ♦ ♦ ♦

## ౪

తెల్లవారింది. విజయదశమి అందరూ తలంటి పోసుకున్నారు. కాఫీలయ్యాయి. ఉదయం 10 గంటలు అయింది. జానకి తెల్లపట్టుచీర కట్టుకొని పొడిపొడిగాఉన్న తలను ఒదులు జడగా వేసుకొని సజ్జనిండా పూలుకోసుకొని వంటింటిదగ్గర పూజాపీఠందగ్గర కూర్చుంది, తెల్లని ఇత్తడిసెమ్మెల్లో దీపాలు ధగధగ వెలుగుతున్నాయి. ఆదీపాల వెలుగులో మెరిసే ఆమె పవిత్రమూర్తి పీఠంమీద భావించే శారదాదేవికి ప్రతిబింబంలా ఉంది ఆనందం సరదాగా పెరట్లో పూలచెట్లదగ్గరకు వెళ్ళి రెండు గులాబీలు కోసి పూజదగ్గరకువెళ్ళి “అమ్మా ఈ రెండుపూలతో కూడ అమ్మవారిని పూజించు. నామనస్సు సంతోషిస్తుంది” అన్నాడు. అమె అప్యాయంగా సజ్జ అతనిముందుకు ఉంచింది. విశ్వనాధంవచ్చి “నీకూ ఈచాదస్తాలేమిటోయ్, ఇలారా, బ్రిడ్జి ఆడుకుందాం” అని హాల్లోకి తీసుకుపోయాడు పూజలు, భోజనాలు అయాయి, మధ్యాహ్నం నాల్గుగంటలకు ఆనందం తాను పట్నంనుంచి తెచ్చిన పాకెట్టు విశ్వనాధంచేతికిచ్చాడు. ముసిముసి నవ్వుతూ విశ్వనాధం ఓపాకెట్టు అంతకుముందే పట్టుకున్నాడు, అతడు భార్యదగ్గరకు వెళ్ళి ‘జానకీ! విప్పకుండా ఇందులో నీకేది కావాలో తీసుకోవాలి’ అన్నాడు. ఆమెచిఱునవ్వుతోవచ్చి మాటాడ

కుండా రెండూతీసుకుంది. అబ్బా! గడుసుదనం, అని హాల్లోవున్న ఆనందం దగ్గరికి వచ్చాడు. ఆరాత్రి గోపాలస్వామి గజోత్సవం. పెందరాడే భోజనాలుచేసి ఉత్సవం చూడడానికి వెళ్లాలనిప్రయత్నం. రాత్రి ఏడుగంటలకి ఉత్సవం ప్రచండంగా సాగుతుంది.

అరగంటలో ఆత్యుత్సాహంతో జానకివచ్చింది. కనకాంబరం రంగు కోయంబత్తూరు చీరకట్టుకుంది. కొత్త రకం అంచుమీద నాజూకైనజరీ మిలమిల మెరుస్తోంది. జడలోని మరువం గుప్పున పరిమళించింది. ప్రొద్దుట పూజచేసిన గులాబీలురెండు, జడకు మధ్యగా కనబడుతున్నాయి. విశ్వం తెల్లబోయాడు. తాను ఎంతో మనసుపడి తెచ్చిన ఇంగ్లీషువాయిల్ చీర నచ్చలేదా? ఇది అతడు మద్రాసునుంచి తెచ్చిందికాదూ! నిజానికి బాగుంది. కాని నాఅభిరుచి, సరదా, కోరగానివేనా, జానకి తన హృదయానికి దూరమైపోతున్నట్టు హఠాత్తుగ తోచింది. ముఖంలో ఏభావమూ పట్టివ్వకుండా "జానకీ! వాయిల్ చీర నచ్చలేదుకదూ! పోనీ మార్చివేద్దాం "నచ్చకేం అద్భుతంగావుంది. కాని ఈవేళ పేరంటముంది. ఇది విందుగా ఉంటుందనుకున్నాను. ఏం బాగులేదా? సాయంత్రం వాయిలు కట్టుకుంటే సుఖంగావుంటుంది. అంది సహజమైన చనువుగా.

ఓ! అద్భుతంగా ఉంది. అని మాటఅప్పగించాడు జడలో కొట్టవచ్చినట్టుకనబడే గులాబీపూలు మనస్సులో గుచ్చుకున్నాయి. ఆమె పేరంటానికి వెళ్లింది.

సాయంకాలమైంది. ఆనందం మామూలుగా పొలాలవైపు షికారు పోదాం రమ్మన్నాడు. విశ్వం తలనొప్పిగాఉంది, రాలే

న్నాడు, ఆనందానికి అంతుపట్టలేదు. పోనీ! కాసేపు పడుకో, నేనే తిరిగి వస్తానని వెళ్లాడు. తిరిగివస్తుండగా పాలవెల్లి పొంగి పోయినట్టు వెన్నెల వచ్చింది. ఆవెన్నెలకాంతిలో వృక్షశిఖరాలు, ఇండ్లకప్పులు, చెరువుగట్లు, పట్టరాని ఉత్సాహంతో నవ్వుతున్న ట్లున్నాయి. అచేతనాలకు కూడా ఈనాడు పండుగేకాబోలు! ఎన్ని శరత్తులు, ఈబ్రతుకులో గడచాయో! ఈశరత్తు పట్నంలో చైతన్యం గోల్పోయిన నన్ను మానవుణ్ణిచేసింది. ఇంకేంచేస్తుందో!! రవ్వి యింటికివచ్చాడు, విశ్వం యింకా లేవలేదు. జానకివచ్చి ఇంట్లో మామూలుగా పనిచేసుకుంటోందికాబోలు.

పది నిమిషాలుగడిచాయి....

ఆమె ఇవతలకివచ్చి 'భోజనానికి లేవండి. పెందరాళే వెళ్లవచ్చు', అంది. విశ్వం మెల్లగాలేచి "నావంట్లో బాగాలేదు, భోజనం చెయ్యను. ఆనందం చేస్తాడు. మీరిద్దరూ సరదాగా తిరిగి రండి!" ఎంతో సహజంగా అన్నాడు. ఆనందానికి వీణాగానం వింటూ వింటూ చట్టున అపస్వరం విన్నట్టయి నివ్వెరపడ్డాడు. జానకి వెళ్లిపోయింది, 'విశ్వం! లే. కొంచెం చెయ్యవచ్చు. ఎవరికి మాత్రం ఆకలుంది? నువ్వులేని ఉత్సవం నాకెందుకు! పోనీ నీకు ఇబ్బందిగా ఉంటే అందరం మానివేద్దాం' అన్నాడు. విశ్వం లేచాడు అంత ఉత్సాహమైనవాడూ ముభావంగా మూడు నిమిషాల్లో భోజనం ముగించి వచ్చిపడుకున్నాడు. ఆనందం డాబా మీద వెన్నెలలో కొంతసేపు తిరిగి తిరిగి చట్టున ఏదో స్ఫురించి కిందికివచ్చి తనహోల్డాలు సర్దుకొని వీధి అరుగుమీద పక్కవేసు కొని శూన్యంలోకి చూస్తూ పడుకున్నాడు. దూరంనుంచి గజో

త్పవం తాలూకు చల్లని దక్షిణాది సన్నాయిరాగం, బాణసంచా క్రూరధ్వనులు వినబడుతున్నాయి.

* * * *

తెల్లవారింది. జానకి నెమ్మదిగా విశ్వాన్నిలేపి చెప్పింది. ఇంట్లో అన్నయ్యగారూ, ఆయన సామాను గూడాలేదు, చెప్ప కుండానే వెళ్లిపోయారు గాబోలు. అంది. ఆశ్చర్యంగా! విశ్వం చట్టునలేచి 'అన్నయ్యఎవరు!' హాల్లోచూశాడు. అనందం డు, టీపాయిమీద ఒక కవరుమాత్రం చిరునామా రాసివుంది. విశ్వం నెమ్మదిగా తీసాడు.

"విశ్వం! ఏమీ అనుకోకు! హఠాత్తుగా వెళ్లిపోవాలని తోచింది. వెళ్లిపోతున్నాను. ఏమీ చిన్నబుచ్చుకోవడం లేదు. ఖులాసాగా నవ్వుతూ నీతోగడిపిన తీయనిగడియలు పులకరింపు లతో తలుచుకుంటూ రైలెక్కుతాను. విన్నా, నీకన్నాఎక్కువగా నీభార్యనూ ప్రేమిస్తున్నాను. కారణం నువ్వెరగవు. సరిగ్గా ఇట్లాంటి వయస్సుగల మాచెల్లెలు జ్ఞాపకం వచ్చింది ఆమె యిప్పుడులేదు. నీయింట్లో అడుగు పెట్టగానే నీయిల్లాలునుచూసి మా చెల్లెలు ఎట్లాబ్రతికివచ్చిందా అని ఆశ్చర్యపడి కళ్లు తుడుచు కున్నాను. అందుకోసం అంతచనువుగా, ఆప్యాయంగా, కొత్త వాడినైనా ప్రవర్తించాను. ఆమాట పైకేఅనాలని రెండుసార్లు అనుకొని అశ్లీలం అని మానివేశాను. స్త్రీని సోదరిగా కూడా ప్రేమించవచ్చునన్నది మనం మరచిపోయాం. మన సంస్కారం అట్లాంటిది. మనచదువులుమన్ని 'ఒథెల్లోలను"గా చేశాయిగాని శివస్వరూపులుగా చేయలేకపోయాయి. నీ తప్పులేదు. విశాల

హృదయంకోలుపోయిన ఈనాటి మానవ మనస్తత్వానికి నువ్వు ప్రతినిధివి. శాంతసుందర సరస్సులో రాయిపడి అలలురేగడం నేను భరించలేను. అది మళ్ళా తేరుకొని రేపుదయం ప్రభాత కాంతిలో తళతళ మెరయాలి. అదీ నా తుదికోరిక. నీ భార్య అయోధ్యాంతఃపురంనుంచో. వాల్మీక్యాశ్రమంనుంచో నడచివచ్చిన అచ్చపు జానకీదే వనినమ్ము. ఆమెజీవన సంగీతంలో అపస్వరం వెదకడం మనపాపరేఖ. వెఱ్ఱిరాముడువేషాలు వెయ్యక నీ గృహ లక్ష్మిని పూజించి తరించు. "గుడ్‌బై"

నీ ........ ఆనందం.

విశ్వం రెండుకళ్ళూ తుడుచుకొని కవరు జేబులో పెట్టు కొన్నాడు.

మైలాపూర్ లజ్‌లో మళ్ళా -ట్రాం- ఆగింది—— అతడు దిగి నవ్వుతూ విజయగర్వంతో ఇంటిముఖంపట్టాడు.

★